వైద్యుల సమ్మెతో రోగుల ఇక్కట్లు





స్థానిక సీహెచ్‌సీలో వైద్యం కోసం రోగుల నిరీక్షణ, పాలకోడేరు ఆరోగ్య కేంద్రంలో కాలుకి డ్రస్సింగ్‌కు ఇబ్బంది పడుతున్న రోగి

ఆకివీడు: వైద్యుల కొరత, సమ్మెతో రోగుల ఇక్కట్లు తప్పడం లేదు. పల్లెల్లో వైద్యం అందజేసే వైద్యులకే ఇబ్బందులు ఎదురవవ్వడంతో సోమవారం సమ్మెకు దిగారు. దీంతో పలు పీహెచ్‌సీల్లో ఎంపీహెచ్‌ఓలు వైద్యం అందజేయాల్సి వచ్చింది. ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలోని పీహెచ్‌సీ వైద్యుడి కొరతతో పాటు పార్మాసిస్ట్, స్టాఫ్ నర్సు కొరత ఉంది. దీంతో ఒక వైద్యుడే మండలంలోని అన్ని గ్రామాలకూ వైద్యం అందజేయాల్సి వస్తుంది. కోలొకొటిడ్ పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులకు ఒక వైద్యులే ఉన్నారు. ఇక్కడ పనిచేసే వైద్యురాలిని పెదకాపవరం పీహెచ్‌సీకి తరలించడంతో మండలంలోని కొన్ని గ్రామాలకు వైద్యం మరింత ఇబ్బందికరంగా మారింది. కోలొకొటిడ్ పీహెచ్‌సీలను ఏర్పాటు చేసినా సిబ్బంది, భవనాల కొరత ఉంది. పాలకోడేరు మండలంలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టు ఖాళీగా ఉంది. అటెండర్, నైట్ వాచ్‌మెన్ కొరత ఉంది. వైద్యులకు ప్రామోషన్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 20 ఏళ్లగా ఒకే ప్రాంతంలో పనిచేస్తూ పదోన్నతులు పొందలేకపోతున్నామని వాపోతున్నారు. యండగండి పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నిషియన్ కొరత ఉంది.

నీరుగారిన ఓపీలు

పీహెచ్‌సీ వైద్యుల సమ్మెతో పీహెచ్‌సీల్లో రోగుల శాతం పడిపోయింది. పలు పీహెచ్‌సీల్లో ప్రతి రోజూ 60 నుంచి 100 వరకూ రోగులు వచ్చి వైద్యం పొందేవారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రోగాలతో పాటు, ఇతర జబ్బులతో వైద్యం పొందుతుండేవారు. రోగులపై సమ్మెట పోటు పడింది. ఇటీవల స్వస్థ్ నారీ వైద్య కార్యక్రమం గ్రామాల్లో చేపట్టారు. వాటిపై కూడా వైద్యుల సమ్మె ప్రభావం పడింది. రెండవ రోజు సమ్మెకు దిగితే రోగులు మరింత ఇబ్బంది పడే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు డాక్టర్ల సమ్మె విరమణకు కృషి చేయాలని కోరుతున్నారు.

సేవలకు గుర్తింపు లేదు



పల్లెల్లోకి వెళ్లి పేద ప్రజలకు వైద్యం అందిస్తూ సేవలందిస్తున్న తమకు తగిన గుర్తింపు లభించడంలేదు. పదోన్నతులు కల్పించడంలేదు. పీహెచ్‌సీలో చేరినప్పటి ఉద్యోగంతోనే పదవీ విరమణ చేయాల్సి వస్తుంది. ఏడాది కష్టపడి చదివితే ఉన్నత చదువు పూర్తి చేయగలము. మూడేళ్లు కష్టపడి పనిచేస్తే ఉన్నత చదువుకు కోటా ఇస్తామన్నది ప్రభుత్వం తగ్గించడం దారుణం.

– డాక్టర్ రమేష్, పీహెచ్‌సీ, పెదకాపవరం, ఆకివీడు మండలం

పీహెచ్‌సీల వద్ద పెరుగుతున్న రోగులు



గొల్లవానితిప్ప పీహెచ్‌సీలో డాక్టర్లు లేకపోవడంతో ఫార్మాసిస్టు రోగులకు వైద్యం అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప, తుందుర్రు గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో చిన అమిరం, రాయలం, కొమరాడ, అనాకోడేరు, దొంగపిండి, వెంప, బేతపూడి, వెంప, గూట్లపాడు, దిరుసుమర్రు, యనమదుర్రు, దెయ్యాలతిప్ప, నాగిడిపాలెం, దొంగపిండి, తోకతిప్ప, లోసరి, కొత్తపూసలమర్రు, ఎల్‌వీఎన్‌పురం, కొవ్వాడ అన్నవరం, నరసింహపురం తదితర 25 గ్రామ పంచాయతీల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. అయితే గత నెల రోజులుగా వర్షాలు పడుతుండటంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. దీంతో దోమలు ప్రబలడం, తాగునీరు కలుషితం కావడంతో వైరల్ జ్వరాలు వస్తున్నాయి. దీంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోగులు వస్తున్నారు. సాధారణంగా రోజుకు 40 నుంచి 50 మధ్య రోగులు వైద్య సదుపాయం పొందేవారు. ఈ వర్షాలకు వైరల్ జ్వరాలు ప్రబలడంతో 50 నుంచి 60 వరకు రోగులు వస్తున్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. సోమవారం నుంచి వైద్యాధికారులు సమస్యలు పరిష్కరించాలని నిరసనలు తెలుపుతున్న నేపథ్యంలో సుగర్, బీపీ, ఆస్తమా, తదితర దీర్ఘకాలిక రోగులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అత్యవసర రోగులను భీమవరం ఏరియా ఆస్పత్రులకు సిఫారసు చేస్తున్నారు. ఆస్పత్రులలో డాక్టర్లు లేకపోతే మా ఆరోగ్య పరిస్థితి ఏమిటని భయాందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

జీఎస్టీ సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టం



భీమవరంలో ఖాదీ వస్త్రాలనే కొనుగోలు చేద్దామనే బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: జీఎస్టీ సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టపర్చాలని, స్వదేశీ వస్తువులనే అందరూ వినియోగించాలని రాజ్యసభ సభ్యుడు పాక వెంకట సత్యనారాయణ అన్నారు. సోమవారం భీమవరంలోని ఎంపీ నివాసంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఖాదీ వస్త్రాలనే కొనుగోలు చేద్దాం – భారతీయతను చాటుదాం అనే బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి ఖాదీ వస్త్రాలను కొనుగోలు చేయాలని దేశ ఉత్పత్తి వనరులు మన దేశంలోనే వినియోగించాలన్నారు. ప్రజల అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను అమలు చేస్తున్నాయని స్వచ్ఛంద సంస్థలు ఇటువంటి అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, బీజేపీ నాయకులు అరసవల్లి సుబ్రహ్మణ్యం, కోమటి రవి, బూసి బెనర్జీ, రమణ తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో యూనియన్ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం



యూనియన్ బ్యాంక్ నూతన శాఖను ప్రారంభిస్తున్న బ్యాంక్ రీజనల్ హెడ్ ఉదయగిరి

భీమవరం: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎల్లప్పుడూ గ్రామీణ ప్రాంతాలలో ఆర్థిక సేవలను విస్తరించడానికి కట్టుబడి ఉందని బ్యాంక్ రీజనల్ హెడ్ ఉదయగిరి మణ్యం అన్నారు. సోమవారం భీమవరం పట్టణం ఉండి బైపాస్ వద్ద కొత్త శాఖను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన శాఖలో ఆధునిక బ్యాంకింగ్ సౌకర్యాలతో పాటు, సేవింగ్స్ ఖాతా, కరెంట్ ఖాతా, డిజిటల్ బ్యాంకింగ్, అన్ని రకాల రుణ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ నాగేంద్రప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చినమిల్లి పరామర్శలు



చినఅమిరంలో వీరభద్రుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న చినమిల్లి వెంకటరాయుడు

భీమవరం అర్బన్: చినఅమిరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుడిమెట్ల వీరన్న కుటుంబ సభ్యులను సోమవారం భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినిమిల్లి వెంకటరాయుడు పరామర్శించారు. ఇటీవల వీరన్న మృతి చెందడంతో ఆయన కుమారుడు గుడిమెట్ల వీరభద్రుడు, ఆయన కుటుంబాన్ని చినిమిల్లి వెంకటరాయుడు పరామర్శించి ధైర్యం చెప్పారు. వీరన్న పార్టీకి ఎనలేని సేవ చేశారని ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. అధైర్య పడవద్దని మేమంతా అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గొట్టుముక్కల పద్మరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు శీలంశెట్టి రోహిత్, కోనాల రాజశేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకోడేరు: మండలం గొల్లలకోడేరు గ్రామంలో జిల్లా ప్రకృతి వ్యవసాయ డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ నూకరాజు ఆదేశాల మేరకు ప్రకృతి వ్యవసాయం డ్రిస్టిక్ కోఆర్డినేటర్ అరుణ కుమారి ఆధ్వర్యంలో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 50 లీటర్ల అగ్నిస్త్రం తయారు చేసే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరిస్తూ తయారు చేశారు. ఈ సందర్భంగా అరుణకుమారి మాట్లాడుతూ గ్రామంలో రైతులంతా ఈవిధం అగ్ని అస్త్రం కాషాయం తయారు చేసుకొని వరి పంటలో ఉండే శత్రువు పురుగు గుడ్లను నివారిచేందుకు, వరిలో వచ్చే ఆకు ముడుత పురుగు, కాండం తొలుచు పురుగు, వేరు పురుగు నివారణకు కాయ తొలుచు పురుగు, వేరు పురుగు నివారణకు బాగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమవరం డివిజనల్ ఇంచార్జ్ రమేష్, వీరేంద్ర, రమాదేవి, వెంకట లక్ష్మి, రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి



తోకతిప్పలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం అర్బన్: గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకుడు డిమాండ్ చేశారు. మండలంలోని యనమదుర్రు డ్రైయిన్‌పై తోకతిప్ప, గొల్లవానితిప్ప, రెస్టహౌస్ రోడ్డు వద్ద నిరుపయోగంగా ఉన్న వంతెనలకు అప్రోచ్ రోడ్డు నిర్మించాలని అక్టోబర్ 3న తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. భీమవరం మండలంలోని తోకతిప్ప గ్రామంలో సోమవారం ధర్నా విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్న గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. గత 10 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెనలు అప్రోచ్ రోడ్లు లేక నిరుపయోగంగా ఉన్నాయని వాహనదారులు, ప్రయాణికులు దగ్గరమార్గం కావడంతో వంతెనలపై ప్రయాణించి ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అక్టోబర్ 3న తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా విజయవంతం చేయాలని కోరారు. ఈ సైకిల్ ప్రచార యాత్రలో బొడ్డు లక్ష్మీపతి, సింధు, తిరుమాని నాగేశ్వరరావు, తోటి శుభాకర్‌రావు, పొన్నమండ నాగేశ్వరరావు, మైలా శ్రీను, పట్టెం శుభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబాలకు ఆర్థిక సహాయం



భీమవరంలో చెక్కులు అందజేస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: పోలీసు శాఖలో పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఇరువురు పోలీస్ కానిస్టేబుళ్ల కుటుంబాలకు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న పి శ్రీహరి జూన్ 7వ తేదిన అనారోగ్యంతో మరణించారు. అలాగే అత్తిలి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న జి సురేంద్రనాథ్ జూన్ 9వ తేదిన మృతి చెందారు. ఇరువురి కుటుంబ సభ్యులను సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పరామర్శించి కష్ట సమయంలో పోలీసు శాఖ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఒక్కొక్క కుటుంబానికి అడిషనల్ కార్పస్ ఫండ్ నుంచి రూ. లక్ష, పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ద్వారా డీసీస్డ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయం చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి భీమారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కెవీవీఎన్ సత్యనారాయణ, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం



ఆకివీడు: సరస్వతీ దేవి అలంకరణలో పెద్దింటి అమ్మవారు



భీమవరం(ప్రకాశం చౌక్): సరస్వతీదేవి పార్వతిదేవి అమ్మవారు



భీమవరం(ప్రకాశం చౌక్): సర్వస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



వీరవాసరం: దుర్గమ్మకు కుంకుమ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో విద్యార్థులు పెద్ద ఎత్తున అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం పుస్తకాలు పంపిణీ చేశారు. మూలా నక్షత్రం సందర్భంగా స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండయేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, హోమం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక దుంపగడప రైల్వే గేటు వద్ద కనకదుర్గమ్మను సరస్వతీదేవిగా కొలిచి పూజలు చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

ఉండి: మూలా నక్షత్రం సందర్భంగా దుర్గమ్మ సరస్వతీ అవతారంలో విద్యార్థులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉండి చెన్నమల్లేశ్వరుని ఆలయంలో కొలువైన అమ్మవారికి భక్తులు విశేష పూజలు చేశారు. అనంతరం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేసిన చిన్నారులకు విద్యాసామగ్రిని బహుమానంగా అందజేసారు. అనంతరం పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు నిరాజన మంత్రపుష్పాలు, కుంకుమ పూజలు చేసిన అనంతరం భక్తులు ప్రసాదం అందజేశారు.

సరస్వతీదేవిగా దుర్గమ్మ

కాళ్ల: దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని బొండాడలో కొలువై ఉన్న పార్వతీ సమేత భోగేశ్వర స్వామి, శ్రీదేవి భూదేవి సమేత జనార్దన స్వామి ఆలయాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారు సోమవారం సరస్వతీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా సుమారు 200 మంది విద్యార్థులు సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేవస్థానం ఈవో వేగేశ్న ఆంజనేయ రాజు, సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ ఫోటో కాళ్ల: కాళ్లకూరు గ్రామం వెంకటాపురంలో ఉన్న కనకదుర్గమ్మను రూ.7.50 లక్షలతో అత్యంత సుందరంగా అలంకరణ చేసి ధనలక్ష్మి అలంకరణలో సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 100 మంది మహిళా భక్తులతో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందించారు.

మావుళ్లమ్మకు విశేష పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భీమవరం పట్టణంలో మావుళ్లమ్మను సోమవారం సరస్వతీదేవిగా అలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు, చండీ హోమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పంచారామక్షేత్రం:

పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్దన స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాల్లో భాగంగా సోమవారం పార్వతీదేవి సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.కృష్ణంరాజు ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు. భీమేశ్వస్వామి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు వైభంగా జరుగుతున్నాయి. ఈకార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి తోట శ్రీనివాస్, ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు

వీరవాసరం: దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల్లో సోమవారం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వీరవాసంలోని కనకదుర్గమ్మ ఆలయంలోనూ, తోలేరులో శ్రీ ప్రసన్న కనక దుర్గాదేవి ఆలయంలోనూ, రాయకుదురు, కొనితివాడ, మడుగు పోలవరం, అండలూరు, తోలేరు, చింతల కోటి గరువు, మత్స్యపురిపాలెం, మత్స్యపురి, బాలేపల్లి, మెంటేపూడి, దూసనపూడి, పెరికిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో శంకరమంచి రఘు, కొడమంచిలి ప్రసాద్, అడబాల బాబీ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉండి: విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు



కాళ్ల: వెంకటాపురంలో ధనలక్ష్మి అవతారంలో దుర్గమ్మ

కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించండి



ఆకివీడు నగర పంచాయతీ సర్వ సభ్యసమావేశం

ఆకివీడు: పట్టణంలోని అభివృద్ధి పనులు చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని పలువురు కౌన్సిలర్లు సర్వ సభ్య సమావేశంలో డిమాండ్ చేశారు. స్థానిక నగర పంచాయతీ సర్వ సభ్య సమావేశం సోమవారం చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ నిధులు రూ. 2 కోట్లు ఉన్నప్పుడు బిల్లులు ఎందుకు చెల్లించడంలేదని ప్రశ్నించారు. కొత్తగా పనులు చేపట్టాలంటే ఎలా చేపడతారని నిలదీశారు. నగర పంచాయతీ పరిధిలో జరిగిన పనులకు సొమ్ము చెల్లిస్తామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు రావడం లేదని కమీషనర్ కృష్ణమోహన్ చెప్పారు. శానిటేషన్, వాటర్ సరఫరా అధ్వానంగా ఉందని పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. శానిటరీ సిబ్బంది వార్డుల్లో సక్రమంగా పనిచేయడం లేదని తెలిపారు. అనంతరం అజెండాలోని అంశాల్ని ఆమోదించారు. సమావేశంలో విప్ పడాల శ్రీనివాసరెడ్డి, వైస్‌చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, మోటుపల్లి కుమారి, అప్రపున్నీస్సా, తిరుమానేని మాధవి, జిల్లా పెద్దిరాజు, కట్టా రవి, నిమ్మల నాగు, గేదల అప్పారావు, గుండుగొలను సావిత్రి, ఎండీ.జక్కీ, కూటమి కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒకేషనల్ కోర్సుల్లో ప్రావీణ్యం సాధించాలి



గొల్లవానితిప్ప యూనియర్ బ్యాంకులో బ్యాంకు శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

భీమవరం అర్బన్: విద్యార్థులు విద్యతో పాటు ఒకేషనల్ కోర్సుల్లో ప్రావీణ్యం సాధించాలని అది భవిష్యత్తులో ప్రధాన భూమిక పోషిస్తుందని జిల్లా ఒకేషనల్ కో ఆర్డినేటర్ పి. సంజీవ్ కుమార్ విద్యార్థులకు సూచించారు. భీమవరం మండలంలోని గూట్లపాడు హైస్కూల్ విద్యార్థులకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో 10 రోజుల పాటు ఇంటర్న్ షిప్ ప్రొగ్రాంలో భాగంగా యూనియన్ బ్యాంకు, సచివాలయం, మీ సేవా కేంద్రాలలో బీఎఫ్ఎస్ఐ, ఐటీ ట్రేడ్ విభాగాలలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. సోమవారం జిల్లా ఒకేషనల్ కో ఆర్డినేటర్ పి. సంజీవ్‌కుమార్ శిక్షణ తరగతులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థి దశనుంచే ఒకేషనల్ కోర్సుల్లో పట్టు సాధించాలన్నారు. అనంతరం బ్యాంకు మేనేజర్, సచివాలయ సిబ్బంది, మీ సేవా సిబ్బందితో విద్యార్థుల శిక్షణ ప్రగతిపై ఆరా తీసి అభినందించారు. అనంతరం పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ దివ్య, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం



చింతలకోటిగరువులో ఉచిత వైద్య శిబిరం

ఉండి: మహిళల ఆరోగ్యమే కుటుంబానికి రక్ష అని చిలుకూరు సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు అన్నారు. సోమవారం చిలుకూరు గ్రామంలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఏ కుటుంబంలో మహిళ ఆరోగ్యంగా ఉంటుందో ఆకుటుంబం అన్ని రంగాల్లోను అభివృద్ధితో ముందుకు సాగుతుందన్నారు. ఇంటిని చక్కబెట్టుకుని ఎవరికి ఏం కావాలో చూసేది అమ్మేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవి, వీఆర్వో విజయలక్ష్మీ, యండగండి పీహెచ్‌సీ వైద్యాధికారి జీ వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చింతల కోటిగరువులో ఉచిత వైద్య శిబిరం

వీరవాసరం: మండలంలో వీవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గ్రామ పంచాయతీ నందు స్వస్థ్ నారీ స్వశక్తి పరివార అభియాన్ కార్యక్రమం చింతల కోటి గరువు సర్పంచ్ దాసరి మహాలక్ష్మి ఆధ్వర్యంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంవీఎస్ రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్యాన్సర్ స్క్రీనింగ్, గర్భిణులకు, రక్తహీనత గల పిల్లలను పరీక్షించి తగు సూచనలు అందించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ కె.ప్రసాద్, సౌజన్య, అపర్ణ, లీల, దాసరి మాణిక్యాలరావు, కొల్లెపర శ్రీనివాసరావు, ఇర్రింకి సుధ, ఇర్రింకి మాధవ్, పంజా శ్రీనివాస, వైద్య సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం అర్బన్: కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన స్వస్థనారీ–స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి కె. అప్పారావు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ బి. సరోజ, ఝాన్సీ, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

బీజేపీకి సరైన బుద్ధి చెప్పాలి



భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న భీమారావు

భీమవరం: మతోన్మాద, పెట్టుబడిదారీ అనుకూల విధానాలతో ప్రజావ్యతిరేక నియంతృత్వ పాలన సాగిస్తున్న బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా సీపీఐ శ్రేణులు కృషి చేయాలని సీపీఐ జాతీయ మహాసభల్లో పిలుపు నిచ్చినట్టు ఆపార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు చెప్పారు. సోమవారం భీమవరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈనెల 21వ తేది నుంచి అయిదురోజులపాటు చండీఘర్‌లో జరిగిన సీపీఐ 25వ జాతీయ మహాసభల తీర్మానాలు, నిర్ణయాలను వివరించారు. మతోన్మాద బీజేపీ పాలన గద్దె దించేందుకు వామపక్ష, లౌకిక, భావసారూప్యత కలిగిన పార్టీలను కలుపుకుని ముందుకు వెళ్లాలని, విశాఖ ఉక్కు పరిరక్షణ, ఏపీకు ప్రత్యేక హోదా విభజన హామీల అమలు కోరుతూ సీపీఐ జాతీయ మహాసభల్లో తీర్మానం చేసినట్టు భీమారావు చెప్పారు. నరేంద్రమోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత రాజ్యాంగం కనీవినీ ఎరుగని రీతిలో ప్రమాదంలో పడిందని సీపీఐ కార్యకర్తలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మహాసభల్లో దిశానిర్దేశం చేసినట్టు తెలిపారు. సీపీఐ, యువజన, మహిళా, కార్మిక, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోరుతూ నిరంతర పోరాటాలు సాగించాలని పార్టీ జాతీయ మహాసభల్లో పిలుపునిచ్చినట్లు ఆయన వివరించారు.